"చివరి నిముషంలో అప్రూవర్‌గా మారినందుకు థాంక్స్. మీరు స్వయంగా దూకిన ఈ మంటలలో డ్రామా లేకపోతే..... జనం పేపర్లు చదివినా, మీరే స్వయంగా చెప్పినా నమ్మేవారు కాదు. చివరి క్షణంలో మా వైపుకి వచ్చి చాలాసార్లు సాయం చేశారు. ఇదంతా కొడుకు మీద ప్రేమా? లేక స్వామితో వచ్చిన కొత్త వైరమా?" అంది.

"చచ్చిన పామునింకా చంపకు. స్వామి తప్పించుకున్నాడు. ఆ సంగతి చూడు."

ప్రవల్లిక అలర్ట్ అయింది. "అంటే... అంటే....." అంది.

"మంటల మధ్య నుంచి భవంతిలోకి ట్రాప్‌డోర్ వుంది."

ఆమె ఆలస్యం చేయలేదు. భవంతిలోకి పరిగెత్తింది. అదే సమయానికి విహారికీ, అనంతానంతస్వామికీ మధ్య సంభాషణ జరుగుతోంది.

"నీ నాలుగో స్థంభాన్ని కూడా పడగొట్టాను స్వామీ! ఏ ప్రజలయితే నువ్వు నీ నాలుగో స్థంభంగా భావించావో వాళ్ళే నిన్ను రాళ్ళతో కొట్టారు. ఈ దేశపు ఎంత శక్తివంతమైన దుర్మార్గుడినయినా, తల్చుకుంటే సామాన్యుడే ఎదుర్కోగలడని నిరూపించాను. నేను వాగ్ధానం చేసినట్టే నీ "బలాన్ని రాజకీయాన్ని పడగొట్టి "తెలివిని" నా తల్లికీ, భారతమాతకీ బహుమతిగా మిగిల్చాను."

స్వామి బిగ్గరగా నవ్వి, "చాలా తెలివిగా మాట్లాడుతున్నాననుకుంటున్నావేమో, వీటన్నిటికీ కలిపి నేను తీసుకోబోతున్న ధర ఏమిటో తెలుసా?.... నీ ప్రాణం" అన్నాడు.

విహారి వెనకనుంచి ఈక్వెలైజర్ 2000 తీశాడు. "ఇది నీ ఆయుధమే స్వామీ! హెలికాప్టర్ నుంచే తీశాను. లోడ్ చేసి వుంది. దాన్ని సంధిస్తే నువ్వు ఆకారం కూడా కనబడకుండా మాయమై పోతావు. ఇదేమిటో నీకు తెలుసుగా! ఇక లొంగిపో" అన్నాడు.

స్వామి తన అంగీలోంచి ప్యాకెట్ కాలిక్యులేటర్‌లాటి వస్తువుని బయటకు తీసి, "ఇదేమిటో నీకు తెలుసా? గాడ్జెట్ మిస్సైల్ తాలూకు రిమోట్ కంట్రోలర్. దాని బటన్ ఇక్కడ నొక్కితే అక్కడ మిస్సైల్ బయల్దేరి పదిమంది నాయకుల ప్రాణాలు తీస్తుంది. రాజధానిలో భవంతి పేలి రాజకీయ సంచలనం ప్రారంభం అవుతుంది. ఇప్పుడు చెప్పు ఎవరి ఆయుధం పవర్‌ఫుల్?" అన్నాడు.

విహారి నిశ్చేష్టుడయ్యాడు. దీన్ని అతను వూహించలేదు. అదే సమయానికి ప్రవల్లిక అక్కడికి చేరుకుంది. ఆమెను వాళ్ళు గమనించలేదు.

"పదిమంది ప్రముఖులు ప్రాణాలు రక్షించుకోవాలంటే నన్ను ప్రాణాల్తో వదిలెయ్యాలి విహారి! ఆ ఈక్వెలైజర్‌ని దూరంగా విసిరెయ్యి."

విహారికేం చెయ్యాలో తోచలేదు.

"రెండు సెకన్లు టైమ్ ఇస్తున్నాను!" హెచ్చరించాడు.

"నువ్వు ఆ కంట్రోలర్‌ని ఉపయోగించవని నమ్మకం ఏమిటి?"

"నేనూ విసిరేస్తాను."

విహారి ఆలోచనల్లో పడ్డాడు.

"ఇంకొక్క సెకనే టైముంది---" హెలికాప్టర్‌లోకి ఎక్కి ఇంజన్ స్టార్ట్ చేస్తూ అన్నాడు స్వామి. అతని బొటనవేలు కంట్రోలర్ స్విచ్ మీద వుంది. తనకన్నా అతడు ఒక మెట్టు పైన వున్నాడని అర్థమైంది విహారికి. అతడు అన్నిటికీ తెగించినవాడు. వెళ్ళనివ్వటమే మంచిది. ఎప్పటికయినా దొరక్కపోడు. అన్నిటికన్నా ముఖ్యంగా... ఇక ఈ దేశానికి అతనివల్ల ప్రమాదంలేదు.

విహారి తన చేతిలోని అయుధాన్ని దూరంగా విసిరేశాడు.

స్వామి కూడా కంట్రోలర్‌ని దూరంగా విసిరేసి, సీటు పక్కనే వున్న పిస్టల్ చేతిలోకి తీసుకుంటూ బిగ్గరగా నవ్వేడు. "మనుష్యుల మంచితనం మీద నీకింకా నమ్మకం వున్నందుకు నాకు చాలా సంతోషంగా వుంది విహారీ! ఈ దేశంలో నాకు చోటులేదు నిజమే. కానీ విదేశీ శక్తులు నాకు తోడున్నాయన్న విషయం మర్చిపోకు. వాళ్ళు చనిపోవటం నాకెంతో అవసరం. అందుకే నీతో మాట్లాడుతూనే దాని బటన్ నొక్కాను. ఆగు..... కదలకు...... అది పల్సెస్ పంపేవరకూ అలా నిలబడాల్సిందే! ఎంతసేపు....? అర నిముషం చాలు. ఇద్దరం కలిసి వాళ్ళ అత్మశాంతి కోసం ప్రార్థిద్దాం."

హెలికాప్టర్ గాలిలోకి రెండడుగులు లేచింది. పిస్టల్ విహారికే గురిపెట్టి ఉంచి "....ఈ చిన్న అలజడికే బెదిరిపోయేటంత చిన్నవాడిని కాను నేను. ఇక్కడ జరిగింది బయట దేశానికి పొక్కేలోపులోనే....." అంటూ ఏదో అనబోయాడు. హెలికాప్టరు పక్కనుంచి ఎవరో దూసుకు వెళ్ళినట్టు కనిపించింది. "హేయ్-ఆగు" అని అరిచాడు. కానీ ఆమె ఆగలేదు. అక్కడ బయల్దేరబోతూన్న మిస్సైల్‌ని ఆపటానికి, తుప్పల్లో పడి వున్న కంట్రోలర్ వైపు వెళుతున్న ప్రవల్లికని విహారి కూడా చూశాడు. స్వామి పిస్టల్ అటు తిరగటం చూసి ప్రవల్లికా! నో-" అని అరిచాడు గట్టిగా.

అయినా ఆమె ఆగలేదు. పరిగెడుతూనే వుంది. జీవన్మరణాల మధ్య తూనీగలా సాగింది ఆ పరుగు, వెనుకనుంచి స్వామి చేతిలో పిస్టల్ పేలింది. వరుసగా ఒకసారి..... రెండోసారి..... మూడు..... నాలుగు ఐదు.......

మొదటి రెండు గుళ్ళూ ఆమె వీపులోకి చొచ్చుకుపోయాయి. తరువాత ఆమె కాళ్ళలోకి.

ఆమె అలాగే కూలబడి పోయింది.

ఇంకో అయిదు సెకనులు మాత్రమే టైముంది.

తుప్పల్లో పడివుంది కంట్రోలర్! చిన్న పాకెట్ కాలిక్యులేటర్‌లా పెద్దసైజు సిగరెట్ పెట్టెలా వుంది. ఆమె చెయ్యి సాచింది. మరో గుండు ఆమె చేతినే చీల్చింది. కొలిమిలో కాల్చిన ఇనపరాడ్ శరీరంలో పెట్టి మెలి తిప్పుతున్న బాధని పళ్ళ బిగువున అదిమిపెట్టి రెండో చేత్తో దాన్ని అందుకుంది. స్వామి మళ్ళీ పిస్టల్ పేల్చాడు. గుళ్ళు లేవు. అతడు దాదాపు హారిఫైడ్ స్టేజిలో వున్నాడు. చప్పున హెలికాప్టర్ని ఆకాశంలోకి తీసుకెళ్ళిపోయాడు.

విహారి ప్రేక్షకుడే అయ్యాడు. మేఘాల్లోకి వెళ్ళిపోతూన్న హెలికాప్టర్ ఒకవైపు, రెక్కలు తెగిన జటాయువులా ప్రవల్లిక ఒకవైపు వున్నారు. కలలోంచి స్పృహలోకి వచ్చినట్టు అతడు ఆమెవైపు పరుగెత్తాడు.

ఆమె శరీరం రక్తంతో తడిసిపోయింది. ఒక గుండు ఛాతీ కివతల పక్కనుంచి దూసుకొచ్చింది. అయినా ఆమె కళ్ళలో కంట్రోలర్‌ని ఆపుచేయగలనన్న తృప్తి వుంది. అతడిని చూసి బలహీనంగా నవ్వింది. నవ్వులోనే వాడి ప్రాణం పోవటం తనక్కావాలి అన్నట్టుగా వుంది. ఆ నవ్వు "వి.... హా.... రీ! వా.... డు ..... చావటం నేను కళ్ళారా చూడాలి అదే..... అ....దే...నా.... నా.... ఆ.....ఖ.... రి..... కోర్కె."

ఆమెని చేతుల్లోకి తీసుకోవటానికి కూడా టైమ్ లేదు.

విహారి లేచి నిలబడ్డాడు. సెంటుమెంటుకి, ఆర్ద్రతకి అక్కడ చోటు లేదు. పోరాటంలో అశువులు బాస్తున్న వీరజవాను ఆఖరి కోర్కె అది. హెలికాప్టర్ మేఘాల్లోకి వెళ్ళిపోతుంది. అతడు ఈక్విలైజర్ చేతిలోకి తీసుకున్నాడు. అతడికి దాన్ని సరిగా గురి చూడటం తెలీదు. ఒకే ఛాన్సు వుంటుందని మాత్రం తెలుసు.

గాలిలో ఎత్తి పట్టుకుని, రేంజి చూశాడు. రెండు కళ్ళూ మూసుకుని, జీవితంలో మొదటిసారి దేవుణ్ని ప్రార్థించాడు. తరువాత కళ్ళు తెరిచాడు. ఎర్రగా వున్నాయి ఆ కళ్ళు. పాయింట్ టార్గెట్ కనబడుతుంది. అతడి చూపుడువేలు ట్రిగ్గర్ మీద బిగుసుకుంది..... మరింత గట్టిగా చిన్న జర్క్. అంతే!

సరిగ్గా అరసెకను తరువాత ఆకాశంలో బ్రహ్మాండమయిన విస్ఫోటనం జరిగింది. పెద్దమంట, పొగ మేఘాల మధ్య చోటు చేసుకున్నాయి. ప్రజల అజ్ఞానాన్నీ మతతత్వాన్నీ తెలివిగా రాజకీయంతో ముడివేసి గూండా బలంతో దేశాన్ని దోచుకుందామనుకున్న అభినవ హిట్లర్ ఆత్మ భూమిమీదకు రాకుండానే ఆకాశంలో కలిసిపోయింది. శరీరం జాడ లేదు.

విహారి వెనుదిరిగాడు.

ఆకాశంవైపే చూస్తూ కదలటానికి కూడా వీల్లేకుండా, జీవచ్ఛవంలా పడివున్న ప్రవల్లిక మొహం సంతృప్తితో వెలిగిపోయింది. ఆమె పెదవులమీద చిరునవ్వు చెరగలేదు. అతి కష్టంమీద కుడిచేతిని పైకెత్తి "మనం విజయం సాధించాం" అన్నట్టు బొటనవేలు చూపించింది. అదే సమయానికి ఆమెవైపు పరుగెత్తుకు వస్తూన్న విహారి విద్యుద్ఘాతం తగిలినవాడిలా ఆగిపోయాడు. శరత్‌కాల తృణప్రతాల్ని గ్రీష్మతాపం కాల్చినట్టు కదిలిపోయాడు. సముద్రగర్భంలో విచ్చుకున్న భూమినుంచి పొంగిన లావా మొత్తం జలసంపదనే ఆవిరి చేయటానికి కంకణం కట్టుకున్న - మనసులో పొంగే ఆవేశం ఆవేదనగా అంతమవుతున్నట్టు అనిపించింది.

ఆమె చేతి బొటనవేలు మీద పుట్టుమచ్చ!!

అతడు గాలిలా చుట్టుముట్టి చేతుల్లోకి ఆమెను తీసుకున్నాడు. "నువ్వు..... ను..... వ్వే.... నా... ప్రవల్లికా?" అన్నాడు అపురూపమైన సంభ్రమాన్ని ఆవేదనతో మిళితం చేస్తూ

నిశ్శబ్దం ఔననటానికి సూచన. నిశ్శబ్దం మరణానికి కూడా సూచనే.

******

గాలిలోకి మూడుసార్లు తుపాకులు పేలాయి.

సెల్యూట్ జరుగుతోంది.

ఆమె శరీరం మీద జెండా కప్పివుంది.

దూరంగా వున్నాడు అతడు. జరుగుతూన్న తంతుతో సంబంధం లేనట్టు నిలబడి వున్నాడు. లాంఛనాలకి అతీతంగా వుంది అతడి మనసు.

నేను చేసింది తప్పే. స్వరం మారిస్తే ఎంత ఆఫీసరైనా స్త్రీ పురుషుడవుతుందా అన్నాను. దానికి ఇంత పెద్ద శిక్షతో పాఠం చెప్తావనుకోలేదు. ప్రేమ సంగతిపోనీ, అది చాలా చిన్న విషయం. మనుష్యులు ఎలా బ్రతకాలో, ఎందుకు బ్రతకాలో నాకు నేర్పేవు. ఆ ఋణం ఎలా తీర్చుకోను?

వీడ్కోలు వేదన కల్గించటానికి, స్నేహం ప్రేమగా పరావర్తనం చెందనవసరం లేదు.

ఆకాశంలో మేఘ తరంగాల మీద నీవు నాలో కలిగించిన స్ఫూర్తి నావలా తేలి ఆడుతూంది. కాలం అనే సుడిగుండం కబళిస్తుందని తెలియక దాన్నే చూస్తూ కూర్చున్నాను. నీ మరణంతో నా జీవితం ఆగిపోవచ్చు. కానీ వంటరి రాత్రుల చీకట్లో హర్షామోదాల మధ్య స్తబ్ధంగా నిలిచిన నిశ్శబ్దం- నాకు తోడై నన్ను ఓదార్చాలే తప్ప మరి దిక్కేముంది?

నాటకాలాడే వాడిని నేను. ఈ దేశపు యువతకి ప్రతీకని నేను. కొండల దగ్గిర తిరిగే శిల్పి హఠాత్తుగా ఒక రాయి దగ్గిర ఆగి, తన భవిష్యత్ శిల్పానికి ఆ రాయిని ఎన్నుకున్నట్టే నన్ను నువ్వు ఎన్నుకున్నావు. ఎవరు పిలిచారని సగం చెక్కి వెళ్ళిపోయావు?

ఇది నువ్వని, నువ్వు కాదనుకుంటూ నేను పొరపాటు పడ్డానని ఆ తరువాత ఎప్పుడయినా తెలిస్తే అది మరెంత నరకమవుతుందా అని ఈ క్షణంలో కూడా నేనూ హింసిస్తున్నానంటే, ఎంత స్వార్థపరుడినో కదా నేను! ఒకే జెండాని దేశపు నడిబొడ్డులో సగర్వంగా నిలబెట్టడం కోసం పోగు చేసిన మట్టికి బలమివ్వాలని నువ్వు భూమిలో కలిసిపోయావు. ప్రేమకన్నా ధ్యేయం గొప్పదని మరిచిన నేను ఇలా ఆక్రోశిస్తున్నాను. నా దు:ఖం చూసి నాకే సిగ్గేస్తూంది. హృదయాన్ని సోకిన ప్రతీ ఉత్తేజిత పూరిత అనుభవాన్నీ క్రోడీకరిస్తే తయారయిన మూర్తివి నువ్వు, నువ్వు అందజేసిన ప్రతీ సైగనీ తప్పుగా అర్థం చేసుకున్న అవివేకిని నేను.

ఇదంతా ప్రేమ కాకపోవచ్చు. స్నేహమే కావొచ్చు. సముద్రాన్నీ సాయంత్రాన్నీ కలిపి నీ గురించి ఆలోచిస్తాను. ఏదైనా మేఘం దిగంతాల్లోకి వెళ్తోంటే, "నీ కోసం ఒక స్నేహితుడు ఇంకా ఇక్కడే వున్నాడని చెప్పు" అని కబురు పంపిస్తాను.

కృతజ్ఞత అంటే ఏమిటి? కనుకొలుకుల్లో అశ్రువులై నిలిచేది. మాటల్లో లాంఛన రూపం దాల్చేది. అదేకదూ, అందుకే కదూ, మాటలు అందని చోటుకి వెళ్ళిపోయావు. మంచులో

రాగం గుండె తూట్లుగా పొడిచేసి మమ్మల్నొదిలేసి అందుకే వెళ్ళి పోయావా? నిశ్శబ్దంలో కూడా నిన్ను వినగలిగేవాడే నిజమయిన స్నేహితుడట. నిజమేనేమో! నా ఈ నిశ్శబ్దం మరొకరి కోసం చెదరటానికి ఎంత సమయం పడుతుందో. ఇకనుంచీ నేను మాట్లాడే ప్రతిమాటల వెనుక, చదివే పుస్తకాల- పుటల-- వాక్యాల-- శబ్దాల-- అక్షరాల మధ్యంతా లీలగా విషాదమే కనపడుతుందేమో.....

స్పర్శకి ఆలోచన తెగింది.

సునాదమాల.

"వెళ్దామా" అన్నట్టు చూసింది. అక్కడెవరు లేరు. అంతా ఎప్పుడో వెళ్ళిపోయారు. తన అనిర్వచనీయావస్థకు అతడికి ఆశ్చర్యమేసింది. ఆమెతో కలిసి కదిలాడు.

చాలాసేపు నిశ్శబ్దం తరువాత ఆమె "ఐయామ్ సారి" అంది.

"ఎందుకు?"

"నేను అర్థం చేసుకోగలను."

అతడు తలూపాడు.

"ఆ కల్నల్‌గారు రాలేదేం?" అడిగింది.

"ఆయనిక రారు."

"అరె! ఏం?"

"యుద్ధంలో పోయారట."

నడుస్తూన్న మాల ఆగి, "అయ్యో పాపం! ఎప్పుడు?" అంది.

అతడు సమాధానం ఇవ్వలేదు.

ఇద్దరూ ఇంట్లోకి వచ్చారు.

బల్లమీద పుస్తకాలు చెల్లాచెదురుగా పడి వున్నాయి. మొదట్లో తను తీసుకొచ్చిన పుస్తకాలు.

"ఇవి ఇక్కడ వున్నాయేమిటి?"

"బామ్మ తీయించింది"

అతడు వాటిని చేతుల్లోకి తీసుకున్నాడు. మాల కోసం తీసుకొచ్చిన పుస్తకాలు అవి. 'అరకులోయలో కూలిన శిఖరం', చలం 'ప్రేమలేఖలు'.

"అన్నట్లు మర్చిపోయాను. అప్పుడెప్పుడో మర్చిపోయాను. అప్పుడెప్పుడో ప్రవల్లిక వచ్చింది. ఇవన్నీ మీరిచ్చారంటే తీసి చూచింది".

అతడి చేతుల మధ్య పేజీలు సన్నగా కనిపించాయి. ఒకచోట పెన్నుతో అక్షరాలు కనిపించి ఆగిపోయాడు.

"తనే వ్రాసింది అవి" వెనుకనించి అంది.

అదేం పుస్తకమో అని చూశాడు.

వెన్నెల్లో ఆడపిల్ల!

పుస్తకం చివర్లో తెల్లకాగితం మీద ముత్యాల్లాంటి అక్షరాలు ‘నా యీ చిలిపి ఆలోచనకి కారణం నువ్వే సుమా!’ అన్నట్టు.

అతడు చదవటం ప్రారంభించాడు.

The otherwise dull and gloomy sky,
looks like a sea of blue.

The otherwise lonely twinkle stars
look like studded precious stones.
The depressing sound of the traffic
flows like music into my ears.
---
You and only you possess this
power of changing disgust into delight.
-----
Golden moments slip by
I cann't hold then back.
Don't ask me what and why
experession is what lack.
All that I can write to you
Is that I have a treasure.
The meetings with you- though few,
they were such a pleasure.
---
As I think of you, my friend
My pen moves uninterruptedly,
But there has to be a stop
and I stop - here